



వివరాలను వెల్లడిస్తున్న ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

పరిషత్ స్థానాలను ఖరారు చేసిన ప్రభుత్వం

ఆదిలాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా? అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. బుధవారం పరిషత్ స్థానాలను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో గతంలో ఉన్న 17 జడ్పీటీసీ స్థానాలను 20కి పెంచగా.. ఎంపీపీ స్థానాలు 20, ఎంపీటీసీ స్థానాలు 166కు పెంచుతూ ప్రభుత్వం జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. త్వరలోనే రిజర్వేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని కూడా పూర్తి చేశారు. అంతేగాకుండా మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించి.. ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు స్పష్టమవుతుంది.

● జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఇలా..

జడ్పీటీసీ	:	20
ఎంపీటీసీ	:	166
ఎంపీపీ	:	20

హిజ్రా హత్య కేసును ఛేదించిన పోలీసులు

● వివరాలను వెల్లడించిన ఉట్నూర్ ఎఎస్పీ కాజల్ సింగ్

వివరాలు 6వ పేజీలో...

అవి ప్రమాద సూచికలా.. ప్రచార బోర్డులా!

వివరాలు 7వ పేజీలో...



జిల్లా పోలీసుల ఝలక్‌తో.. పలువురు ఖద్దర్ నేతల భూకబ్జాల బాగోతం ఒక్కొక్కటిగా బయట పడుతోంది. ఇన్నాళ్లు జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన నేతలే ప్రజాసేవ ముసుగులో అడ్డగోలు దందాలకు ఎగబడుతున్నారు. ఇన్నాళ్లు అడిగే వారే లేరన్నట్లుగా పెత్తనం చెలాయించిన నేతలంతా.. ప్రస్తుతం పోలీసుల కేసుల తో సైలెంటై పోతున్నారు. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నేతల భూ అక్రమా లు, అవినీతి భాగోతం గుట్టురట్టవుతుంది. తాజాగా జిల్లా జాగృతి అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్ రెండో సారి భూకబ్జాల కేసులో అరెస్టు కావడం చర్చనీయాంశంగా మారింది.

ఖద్దర్ నేతల.. కబ్జాల బాగోతం



- జిల్లాలో బాధితుల ఫిర్యాదులతో వెలుగు చూస్తున్న అక్రమాలు
- ప్రధాన రాజకీయ పార్టీల నేతలే అసలు సూత్రధారులు
- వరుసగా రెండవ సారి అరెస్టు అయిన జాగృతి జిల్లా అధ్యక్షుడు
- అధికారం అండతో రూ.కోట్ల విలువ చేసే భూములు, స్థలాలు హాంఫట్
- తప్పించుకుంటూ తిరుగుతున్న బడా నేతలు, ప్రముఖ వ్యాపారులు
- జిల్లా పోలీసుల చర్యలతో పొలిటికల్ లీడర్స్ తర్జన భర్జన

ఆదిలాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికార, ప్రతిపక్ష అనే తేడా లేకుండా భూకబ్జాలకు పాల్పడిన నేతలపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తూ జైలుకు పంపించడం రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. రోజుకో నేత భూకబ్జాల కేసుల్లో ఇరుక్కుని కటకటాల పాలవుతున్నారు. నో పాలిటిక్స్.. అంతా రూల్స్ అండ్ రెగ్యులేషన్ అంటూ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కొరడా ఝులిపించడంతో అవినీతి, అక్రమాలకు పాల్పడిన పొలిటికల్ లీడర్స్ భయంతో వణికి పోతున్నారు. ఏమైనా భూ సమస్యలు, ఆర్థిక వివాదాలు ఉంటే గుట్టుచప్పుడుకాకుండా నలుగురు ముందు సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారు. అయితే ఎప్పుడు? ఏం జరుగుతుందో? చెప్పలేని పరిస్థితులు ఉన్నాయంటూ ఖద్దర్ నేతలు తర్జన భర్జన పడుతున్నారు.

ఖద్దర్ వేసి కబ్జా దందా

ఇప్పటి వరకు పోలీసులు అరెస్టు చేసిన భూకబ్జాల కేసులను పరిశీలిస్తే.. అందరూ ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నేతలే కావడం గమనార్హం. రాజకీయ అండతో అడ్డగోలు అక్రమాలకు పాల్పడినట్లు పోలీసుల చర్యలతో స్పష్టమవుతుంది. సమస్యను పరిష్కరించాలని నేతలను ఆశ్రయిస్తే అసలుకే మోసం జరిగిందంటూ పలువురు బాధితులు వాపోతున్నారు. నకిలీ పత్రాలను సృష్టించి అధికారుల అండదండలతో విలువైన స్థలాలను కొట్టేసినట్లు తెలుస్తుంది. ప్రధానంగా బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు ఫేక్ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేసుకుంటూ భూకబ్జాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. బాధితుల ఫిర్యాదులతో కాంగ్రెస్ పార్టీకి చెందిన పత్తిముజ్జు, బీజేపీ పార్టీకి చెందిన వకులాభరణం ఆదినాథ్, ఆనంద్, సోమ రవి, గంద్రత్ మహేందర్, బీఆర్ఎస్ పార్టీకి చెందిన సాజిదొద్దీన్‌తో పాటు తాజాగా తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్ వరుసగా రెండవ సారి భూకబ్జాల కేసుల్లో అరెస్టు కావడం జిల్లాలో కలకలం రేపుతోంది. అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన నేతలే ఇలాంటి అక్రమాలకు పాల్పడడంపై జిల్లా వాసులు మండిపడుతున్నారు.

కన్నుపడిందా ఖతమే..

జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లోని విలువైన భూములు, స్థలాలపై నేతల కన్ను పడడంతో కనిపించకుండానే పోతున్నాయి. ఖాళీ జాగా కనిపిస్తే చాలు పాగా వేసేయడం ఆ తర్వాత నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకోవడం సర్వ సాధారణంగానే మారింది. భూకబ్జాలకు పాల్పడిన నేతలకు మున్సిపల్, రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల అండదండలు ఉన్నట్లు తెలుస్తుంది. అలాగే అదును చూసి అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్లు చేయడం ఆపైగా అమ్మేసుకోవడం పరిపాటిగానే మారింది. ఏదైనా తేడా వస్తే బాధితులను బెదిరింపులకు సైతం గురి చేయడంతో ఇన్నాళ్లు నేతల అక్రమ భాగోతం బయట పడలేదు. ప్రస్తుతం పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులకు భరోసా ఇవ్వడంతో నేతల అసలు రంగు

(తరువాయి 6వ పేజీలో...)

భూకబ్జా కేసులో జిల్లా జాగృతి అధ్యక్షుడి అరెస్టు

- నకిలీ పత్రాలు సృష్టించి రోడ్డు స్థలం కబ్జా
- స్థానికుడు కౌటిల్‌వార్ సుశీల్ ఫిర్యాదు
- పోలీసుల విచారణలో నిజాలు నిగ్గు తేలడంతో రంగినేని శ్రీనివాస్ అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

ఆదిలాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): భూకబ్జా కేసులో ఆదిలాబాద్ జిల్లా జాగృతి అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నకిలీ పత్రాలను సృష్టించి రోడ్డును కబ్జా చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆదిలాబాద్ పట్టణంలోని హరికిషన్ జిన్నింగ్ మిల్లు ముందు ఉన్న రోడ్డు స్థలానికి 2015లో రంగినేని శ్రీనివాస్ మున్సిపాలిటీ నుంచి డోర్ నెంబర్‌ను తీసుకున్నాడు. దీనిపై ఇంటి పన్నును సైతం చెల్లిస్తూ వస్తున్నాడు. 2016లో జలగం అమూల్, జలగం శ్వేతల పేరిట గిఫ్ట్ డీడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థలం రెగ్యులరైజేషన్ కోసం కూడా 2017లో అర్బన్ తహసీల్దార్ అనుమతులు ఇచ్చినట్లు నకిలీ పత్రాలను సృష్టించి ప్రభుత్వానికి చలాన్ సైతం చెల్లించినట్లు తెలిపారు. దీనిపై స్థానికుడు కౌటిల్‌వార్ సుశీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. నకిలీ పత్రాలతో విలువైన స్థలాన్ని కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు స్పష్టం కావడంతో రంగినేని శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు.

తపాల కార్యాలయాల్లో అందుబాటులోకి నూతన సాంకేతిక

ఆదిలాబాద్ టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తపాల కార్యాలయాలలో ఐటీ 2.0 సాంకేతికత అందుబాటులోకి రానున్నట్లు జిల్లా తపాల పర్యవేక్షకుడు గుంపస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా డిజిటల్ చెల్లింపులు, ఆధునిక సదుపాయాలు వినియోగదారులకు అందుబాటులో వస్తాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 21వ తేదీన తపాల కార్యాలయాలలో సేవలు అందుబాటులో ఉండవని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

'కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'

ఆదిలాబాద్ టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులకు 26వేల రూపాయల కనీస వేతనం చెల్లించడంతో పాటు ఇతరాత్ర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమ ముఖ్య అతిథిగా హాజరై మున్సిపల్ కార్మికుల సమస్యల పై చర్చించి పరిష్కరించేందుకు ఉద్యమ కార్యాచరణ రూపొందించాలని తీర్మాణాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు చిరంజీవి, ఏఐటీయూసీ నాయకులు సిర్రదేవేందర్, గాజంగుల రాజు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



కజ్జర్ల పాఠశాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

ఉపాధ్యాయుల కోసం రోడ్డు ఎక్కిన విద్యార్థులు

● పాఠశాల ఎదుట విద్యార్థులు, గ్రామస్థుల ధర్నా ● తలమడుగు మండలం కజ్జర్ల గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు తాళం

తలమడుగు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కజ్జర్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రోడ్డెక్కారు. పాఠశాలకు తాళం వేసి పాఠశాల ఎదుట ఉదయం నుంచి సాయంత్రం వరకు ధర్నా నిర్వహించారు. వీరికి మద్దతుగా గ్రామస్థులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను జిల్లా అధికారులు సర్దుబాటు పేరిట ముగ్గురు ఉపాధ్యాయులను వేరే ప్రాంతాలకు పంపడం వల్ల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతారన్నారు. పాఠశాలలో ప్రస్తుతం 80 మంది విద్యార్థులు విద్యాబోధనలో కొనసాగిస్తున్నారు. పాఠశాలలో గల ఆరుగురు ఉపాధ్యాయుల్లో ముగ్గురు ఉపాధ్యాయులను సర్దుబాటు పేరిట ఇతర ప్రాంతాలకు పంపించిన వల్ల మా పాఠశాలలో విద్యార్థులకు సరైన విద్య లభించదన్నారు. ప్రైవేట్ పాఠశాలలను మార్పించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తే ఉన్నతాధికారులు సర్దుబాటుపేట ఉపాధ్యాయులను తగ్గించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. పాఠశాలలో ఏఐ బోధన కొనసాగుతుందన్నారు. అలాగే ఇంగ్లీష్ మీడియం కొనసాగుతుందన్నారు. ఆదర్శంగా నడుస్తున్న పాఠశాలలో ప్రభుత్వం గందరగోళం సృష్టించడం ఎంతవరకు సమంజసం అన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సర్దుబాటు పేరిట ఇతర ప్రాంతాలకు తరలించిన ఉపాధ్యాయులను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో టీసీలు తీసుకొని ప్రైవేటు పాఠశాలకు వెళ్తామని హెచ్చరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలకు తాళం వేసి అక్కడే ధర్నా నిర్వహించారు. గురువారం కూడా విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు మహిళా సంఘాలతో ధర్నా నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ఇందులో గ్రామ పెద్దలు, మాజీ మున్సిపల్ కమిషనర్ చింతలపల్లి దేవారెడ్డి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మొటే కిరణ్ కుమార్, అగ్గిముల గంగన్న, గణేష్, ప్రశాంత్, వినోద్, రవికుమార్, ఆదర్శ అమ్మ పాఠశాల అధ్యక్షురాలు, పెద్దసంఖ్యలో గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

● రాయి సెంటర్ సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఇంద్రవెల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం మండలంలోని గిన్నేరా గ్రామంలో నిర్వహించిన రాయి సెంటర్ సమావేశంలో పాల్గొన్న ఎస్పీ రాయి సెంటర్‌లో జరిగే తీర్మానాలు, విధి విధానాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజనులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. మొదటగా ఆదివాసి సంస్కృతీ, సంప్రదాయాల నడుమ డప్పు వాయిద్యాల నడుమ ఎస్పీకి, ఉట్నూరు ఎస్పీ కాజల్ సింగ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. తదుపరి ఆదివాసి రాయి సెంటర్ అధికారులు రాయి సెంటర్ సభ్యులు పాల్గొని స్థానిక సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ ఒక్క ఆదివాసి అభివృద్ధి చెందాలంటే చదువు చాలా ముఖ్యమైనదని యువతకు, పిల్లలకు చదువుపై ఉన్న ప్రాముఖ్యతను తెలియజేసి చదువుకునేందుకు ప్రోత్సహించాలని సూచించారు. అదేవిధంగా ఆదివాసి సంస్కృతిని కాపాడుకుంటూ భావితరాలకు తమ సంస్కృతిని తెలియజేయాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో వేలిముద్రలను ఉపయోగించి ఏటీఎంల ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి జిల్లాలో పండించకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గంజాయి జీవితాలను నాశనం చేస్తుందని, గంజాయి వల్ల ప్రభుత్వ పథకాలు లభించవని తెలిపారు. ఎలాంటి సమస్యలున్నా జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పూర్తి సహాయ సహకార్యలు అందిస్తుందని హామీ ఇచ్చారు. అక్రమ విషయాలపై, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందించేవారు స్వయంగా తన ద్వారా నిర్వహించబడే 8712659973 నెంబర్‌కి వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్, ఎస్సై సాయన్న, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల సమస్యలపై పోరుబాట పట్టాలి'

ఉట్నూర్, జూలై16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పోరుబాట నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సూచించారని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ తెలిపారు. బుధవారం కేటీఆర్‌ని హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణిరాజేశ్ మర్యాద పూర్వకంగా కలిశామన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా విద్యార్థుల సమస్యలపై పోరుబాట పట్టాలని, ఫుడ్ పాయిజన్‌తో అనేక మంది విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నారని, గురుకుల హాస్టల్స్ కానీ, కస్తూర్బా హాస్టల్స్ కానీ, తదితర హాస్టల్స్‌ని తనిఖీ చేసి విద్యార్థులు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారన్నారు.

'యువత ఉపాధి మార్గాలను ఎంచుకోవాలి'

నేరడిగొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పాల శ్రీపాద్ (నాని), వెంకటేశ్వర ఏజెన్సీస్ సిమెంట్స్, రాడ్స్ నూతన షాపును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ యువత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకోవడం అభినందనీయమని అన్నారు. ఆయన వెంట నాయకులు బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి,మౌలానా, విలాస్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి, యువ నాయకులు ఎండీ సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మైక్రో ఫైనాన్స్ పేరిట ఘరానా మోసం

● దాదాపు 300 మంది నుంచి రూ.20 వేల వసూలు ● ఉద్యోగాల ఆశ చూపి డ్రెస్‌కోడ్ సాకుతో డబ్బులు వసూలు చేసిన వైనం ● పరారీలో నిర్వాహకులు, సిబ్బంది

ఆదిలాబాద్ టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగంతో ఇబ్బందులు పడుతున్న వారికి ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపిస్తే డబ్బులు రాలుతాయన్న నమ్మకంతో ఆదిలాబాద్ పట్టణంలో ఓ ముఠా ఘరానా మోసానికి తెరలేపింది. మోసగాళ్ల నమ్మకాన్ని వమ్ము చేయకుండా దాదాపు మూడు వందల మంది బాధితులు వారికి ఇరవై వేల రూపాయల చొప్పున డబ్బులు ముట్టచెప్పి ప్రస్తుతం లబోదిబోమంటున్నారు. ప్రముఖుల చేత డిజిటల్ మైక్రో ఫైనాన్స్ పేరిట ఏర్పాటు చేసిన కార్యాలయాలు తెరిపించి నిరుద్యోగులకు కుచ్చుటోపి పెట్టిన ఘటన కలకలం రేపింది. మోసపోయామని గ్రహించిన బాధితులు సదరు కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా కార్యాలయం మూసి ఉండడంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు న్యాయం చేయాలని కోరారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసి తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదుచేశారు. అయితే ఈ వ్యవహారంలో బాధితుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లి మండలం శంకర్‌గూడకు చెందిన కృష్ణ అనే వ్యక్తి పట్టణంలోని రాంనగర్ కాలనీలో ఇటీవల డిజిటల్ మైక్రో ఫైనాన్స్ పేరిట సంస్థలను ఏర్పాటు చేశారు. ఉట్నూర్, జైనూర్‌లోను బ్రాంచ్‌లను ప్రారంభించి ప్రముఖులతో ఫొటోలు దిగి సోషల్ మీడియాలో హల్‌చల్ చేశారు. రిమ్స్ ఆసుపత్రికి సైతం కోటికి పైగా విలువ చేసే పరికరాలు ఇస్తున్నట్లు ప్రచారం జరిపారు. ప్రజాసేవ చేస్తున్నట్లు పైకి కనిపిస్తునే లోపల నిరుద్యోగులకు టోకరా వేసే భారీ పన్నాగం పన్నారు. ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులకు ఆశ చూపి డ్రెస్ కోడ్ సాకుతో ఇరవై వేల రూపాయలు ఇవ్వాల్సి ఉంటుందని, తిరిగి వేతనంలో ఆ నగదును జమ చేస్తామని నమ్మించారు. సదరు వ్యక్తి ప్రచారం చూసిన బాధితులు ఆయనను నమ్మి డబ్బులు ముట్టచెప్పారు. రెండు నెలలుగా కార్యాలయాల చుట్టు తిరుగుతున్నా ఎటువంటి స్పందన లేకపోవడంతో బుధవారం వచ్చి చూసేసరికి కార్యాలయానికి తాళం వేసి ఉంది. సంబంధిత వ్యక్తుల



మైక్రో ఫైనాన్స్ నిర్వాహకుడితో బాధితులు



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మైక్రో ఫైనాన్స్

(తరువాయి 6వ పేజీలో...)

డిజిటల్ మైక్రో ఫైనాన్స్‌లో ఉద్యోగాల ఎర

● ఉట్నూర్‌లో మోసపోయిన నిరుద్యోగులు

ఉట్నూర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామంటూ ప్రారంభించిన డిజిటల్ మైక్రో ఫైనాన్స్ నిర్వాహకుల వలలో నిరుద్యోగులు మోసపోయారు. ఉట్నూర్ డివిజన్ కేంద్రంగా పాత ఉట్నూర్‌లో ఇంద్రవెల్లి మండలం శంకర్‌గూడాకు చెందిన జవాడే కృష్ణ డిజిటల్ మైక్రో ఫైనాన్స్ ఏర్పాటు చేశారు. ఉట్నూర్ కేంద్రంగా ఏర్పాటు చేసిన కార్యాలయంలో నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 164 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని ఒక్కొక్కరు రూ.20వేల వంతన చెల్లిస్తే డ్రెస్సింగ్ షూట్, రెండు జతల షూస్, టై ఇవ్వడం జరుగుతుందని తెలుపడంతో నిరుద్యోగులు ఉద్యోగాలు లభించాయన్న సంతోషంతో ఒక్కొక్కరు రూ.పది వేల నుంచి రూ.20వేల వరకు చెల్లించారని డిజిటల్ మైక్రో ఫైనాన్స్ డైరెక్టర్ నారాయణ తెలిపారు. తనతో పాటు మరో ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగి శత్రుఘన్, ఆదిలాబాద్‌కు చెందిన ఆదినాథ్, సోను సింగ్, మణిదీప్, రమేష్‌లు డైరెక్టర్లుగా, చైర్మన్‌గా కృష్ణజువాడే ఉన్నారన్నారు. నిరుద్యోగుల నుంచి సుమారు రూ.60 లక్షల వరకు వసూలు చేయడం జరిగిందని నారాయణవివరించారు. తమ ఇంటిలోనే డిజిటల్ మైక్రో ఫైనాన్స్ కార్యాలయాన్ని గత జనవరిలో ఏర్పాటు చేసి



ఉట్నూర్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ మైక్రో ఫైనాన్స్ కార్యాలయం

(తరువాయి 6వ పేజీలో...)



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు చర్యలు

● నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధనతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 13 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయని, 2,417 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్యను పెంచేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మెరుగైన విద్యాబోధనతో పాటు అవసరం ఉన్న కళాశాలల్లో పైకప్పుల లీకేజీలు, మరమ్మతులు, అదనపు మరుగుదొడ్లు, ఫ్లోరింగ్, ఆర్వో ప్లాంట్, తలుపులు, కిటికీలు తదితర అంశాలపై సంబంధిత అధికారులు నివేదిక అందజేయాలని సూచించారు. అవసరమైన చోట ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పనులు చేపట్టాలని, దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరుశురాం, డీపీవో శ్రీనివాస్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ కాజల్ సింగ్

హిజ్రా హత్యను ఛేదించిన పోలీసులు

● నిందితుడు రిమాండ్

ఉట్నూర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని ఇంద్రవెల్లి మండలంలో ఇటీవల జరిగిన హిజ్రా హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇంద్రవెల్లి మండలంలో రాముగూడకు చెందిన టేకం అయ్యు (అరుణ) అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉట్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మడావి ప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో హిజ్రా అరుణ మృతదేహం పూడ్చిపెట్టిన స్థలం నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా చేసి పోస్టుమార్టం చేయించారు. బుధవారం రాత్రి ఉట్నూర్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఎస్పీ కాజల్ సింగ్ మాట్లాడుతూ జాదవ్ అర్జున్, అరుణ మధ్య గత నాలుగేళ్లుగా ప్రేమ కొనసాగుతుందని, ఇరువులు కలిసి సహజీవనం చేస్తూ ఉన్నారని, పెళ్లి చేసుకోమని అరుణ అర్జున్ వెంట పడుతుండడంతో కొన్ని రోజులుగా కాలయాపన చేస్తూ వచ్చాడన్నారు. 7న పథకం ప్రకారం అరుణను అడవిలోనికి తీసుకువెళ్లి ఇద్దరు కలిసి మద్యం తాగిన అనంతరం మద్యం మత్తులో ఉన్న అరుణ తలపై కొట్టి చెట్టుకు ఉరివేశాడని తెలిపారు. అరుణ ఆత్మహత్య చేసుకున్నట్లు నమ్మించడంతో గ్రామస్తులు అరుణ మరణంపై అనుమానాస్పదం వ్యక్తం చేయడంతో ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి పోలీసులు మంగళవారం శవ పంచనామ చేసి పోస్టుమార్టం చేయించిన అనంతరం ఇచ్చోడకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ అర్జున్‌ను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని ఏఎస్పీ వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐ మడావి ప్రసాద్‌తోపాటు ఎస్సైలు సాయన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

'విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి'

ఆదిలాబాద్ టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చదువుల తల్లి సరస్వతి దేవి పవిత్ర బాసర పుణ్య క్షేత్రం ఉన్నప్పటికి ఉన్నత విద్యకు జిల్లా విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని శ్రీజ్ఞాన సరస్వతి విశ్వ విద్యాలయ సాధన సమితి జిల్లాఅధ్యక్షులు సంగెశ్రీనివాస్ అన్నారు.పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని విశ్వ విద్యాలయ ప్రాధాన్యతను వివరించారు. జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు అయ్యేంత వరకు అవిశ్రాంత పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు.

చాందూరిలో రాపిడ్ ఫీవర్ సర్వే

ఉట్నూర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాందూరిలో అధికారుల బృందం రాపిడ్ ఫీవర్ సర్వే(ఆర్ఎఫ్ఎస్) నిర్వహించింది. హస్నాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారుల ఆదేశాల మేరకు చాందూరిలోని 270గృహాలలో తిరుగుతు ఇండ్ల వద్ద ఉన్న నీటి నిలువ పాత్రలను శుభ్రం చేయడంతో పాటు ఇంట్లో ఎవరైనా అనారోగ్యంగా ఉన్నారాఅని తెలుసుకున్నారు.వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇండ్ల చుట్టు నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని, ఎవరికైనా వ్యాధులు సంక్రమిస్తే వెంటనే ఆసుపత్రికి చేరకుని వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాథోడ్‌కిషన్,పంచాయతీ కార్యదర్శి మురారి,ఏఎన్ఎం దీపకుమారి, ఐసీడీఎస్ టీచర్ మలాన్‌బాయి, ఆశావర్కర్లు సురేఖ, సాగర్ బాయిలు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై శిక్షణ

ఆదిలాబాద్ టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉద్యానవన పంటలసాగుకు జిల్లలో అనువైన నేలలు ఉన్న నేపథ్యంలో పంటల సాగు పై ఆసక్తి పెంపొందించుకోవాలని కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన యూనివర్సిటీ ప్రిన్సిపల్; సీనియర్ శాస్త్రవేత్త మురళిసూచించారు. ఉద్యానవన యనివర్సిటీలో ఎస్సీ రైతులకు ఉద్యానవన పంటల పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలి రోజు తెలంగాణ హెడ్ డాక్టర్ మహేందర్ ముఖ్యఅతిథిగా హాజరై పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.పంట వేసిన నాటి నుంచి చేతికందే వరకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల పై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు.ఎటువంటి అవసమున్న ఉద్యానవన యూనివర్సిటీలో సంప్రదిస్తే తగు సలహాలు, సూచనలు అందిస్తామని తెలపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఉద్యానవన అధికారి సందీప్, ఉద్యానవన ఏఈఓలు శ్రీనివాస్, ఇర్ఫాన్‌రైతు సంఘం నాయకులు చిలుక దేవిదాస్, రైతులు పాల్గొన్నారు.

మావల: భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ, హైదరాబాద్ వారి సౌజన్యంతో, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉద్యాన పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో ఎస్సి రైతులకు పండ్ల తోటల సాగుపై సీనియర్ శాస్త్రవేత్త మురళి అవగాహన కల్పించారు. మొదటి విడత శిక్షణతో పాటు రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఉత్తర తెలంగాణ జోనల్ హెడ్ బి. మహేందర్, పసుపు పరిశోధనా స్థానం, కమ్మరపల్లి సీనియర్ శాస్త్రవేత్త హెడ్, జి. సందీప్ కుమార్, ప్రాజెక్టు హార్టికల్చర్ ఆఫీసర్, టి. అలేఖ్య, ఉద్యాన అధికారి, సి.హెచ్. దేవీదాస్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి శివరాజ్, సి. సి. డి. సీడ్ ఫీల్డ్ ఆఫీసర్ శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు

● ఎంపీ గోడం నగేష్

బోథ్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యను అందించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పలు కార్యక్రమాలను చేపట్టి ప్రభుత్వ విద్యను ప్రతిష్ట చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆదిలాబాద్ ఎంపీ బుజ్జి నగేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఫంక్షన్ హాల్‌లో వందమంది విద్యార్థులకు ట్యాప్‌లను, 267 మందికి కుట్టు మిషన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా అధునాతన టెక్నాలజీని అందించాలన్న దుఃఖంతో విద్యార్థులకు ట్యాప్‌లను అందివ్వడం జరిగిందన్నారు. ఉపాధి కోసం కుట్టుమిషన్లను అందించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ తాటిపల్లి రాజు, సొసైటీ చైర్మన్ జివి రమణ, బిజెపి మండల అధ్యక్షులు రవీందర్, నాయకులు రాజేశ్వర్ రెడ్డి, నానం రమణ, సుభాష్, సూర్య, అల్కా గణేష్ పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

● బీజేపీ కార్యకర్తల ఆందోళన

బోథ్: మండలంలో ఎంపీ జి. నగేష్ చేతుల మీదుగా ట్యాబ్‌లు, కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం ఓఎన్జిసి ఆధ్వర్యంలో బుధవారం కొనసాగింది. అయితే ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించిన కనీసం కార్యకర్తలకు సమాచారం లేదని కొంతమంది బిజెపి కార్యకర్తలు నిలదీశారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శి మానాల శేఖర్, జిల్లా నాయకులు కట్ట భూమేష్ లతో పాటు పలువురు ఈ విషయమై నిలదీశారు. కొంతమంది నాయకుల తీరు వల్ల పార్టీ పరిస్థితి రోజురోజుకు దిగజారుతున్నాయని విమర్శించారు. కాగా, కార్యకర్తల ఆందోళన గమనించిన ఎంపి జి. నగేష్ కార్యకర్తల దగ్గరకు వచ్చి మాట్లాడడం జరిగింది. ఆందోళన చెందవద్దని పార్టీలో పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని సముదాయించారు. మరోసారి ఈ విధంగా జరగకుండా చూస్తామని కార్యకర్తలకు భరోసా ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.



మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్న ఎంపీ నగేష్

జీవో 49ని వెంటనే రద్దు చేయాలి

● మాజీ ఎంపీ సోయం బాపురావు

ఆదిలాబాద్ రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవో నెంబర్ 49ని వెంటనే రద్దు చేసి ఆదివాసీ హక్కులను కాపాడాలని మాజీ ఎంపీ సోయంబాపురావు అన్నారు.బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు.ఆదివాసీలు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ పేరిటా జారీ చేసిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం నిలిపి వేయాలని కోరారు. అటవి భూములనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. జీవోను రద్దు చేయకుంటే ఏజెన్సీలో ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. జీవో 49తో 339 గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆదివాసీ గిరిజనులకు న్యాయం చేసేలా చెక్‌డ్యాంల కోసం నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు సోయం బాపురావు తెలిపారు.



రాష్ట్ర మంత్రిని సన్మానిస్తున్న మాజీ ఎంపీ సోయం బాపురావు



మాట్లాడుతున్న బండారు రవికుమార్

● 'రిజర్వ్ ఫారెస్టు ఏర్పాటును విరమించుకోవాలి'

ఉట్నూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కుమ్రంభం ఆసిఫాబాద్ టైగర్‌కన్జర్వేషన్ రిజర్వ్ ఫారెస్టు ఏర్పాటు జీవో 49ని రద్దు చేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ బండారు రవి కుమార్ డిమాండ్ చేశారు. జీవో 49తో ఆసిఫాబాద్ జిల్లాలోని 339 గ్రామాలకు మనుగడ లేకుండా పోతుందని వెంటనే దాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని హెచ్‌కేజీఎస్ పంక్షన్ హాల్‌లో జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజ్యాంగంలో ఐదవ షెడ్యూల్ ఉన్నందున గ్రామసభలు నిర్వహించకుండా ప్రజాభిప్రాయ సేకరణ తీసుకోకుండా పీసాచట్టం అమలు చేయకుండా జీవో తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. అటవి శాఖ ఇప్పటికి ఆదివాసీ గ్రామాలకు ఐటీడీఏ ద్వారా మంజూరైన బోర్లు, త్రిఫేస్‌కరెంట్, రహదారులను గ్రామాలలో వేయనియకుండా అడ్డు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ద్వారా మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్లను సైతం కట్టకుండా అడ్డుపడుతు న్నారన్నారు. మళ్లీ జీవో49 టైటర్ కంజర్వేషన్ పేరుతో ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకం చేసే ప్రయత్నాలను కేంద్ర రాష్ట ప్రభుత్వాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు భూపాల్, ఉడతా రవీందర్, పైళ్ల ఆశయ్య దర్శనాల మల్లేష్, కుశన్నరాజన్న, పూసంసచిన్, ఎర్మపున్నం, తొడసం శంభు, అన్నమొల్ల కిరణ్, బొజ్జ ఆశన్న, కోట శ్రీనివాస్ అశోక్, ఆత్రం తనుష్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్టీల నియామకం కోసం డెమో

● ఆందోళన చేసిన నిరుద్యోగులు

ఉట్నూర్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని నిర్మల్, ఆదిలాబాద్ జిల్లలో ఖాళీగా ఉన్న గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 17మంది సీఆర్పీల నియమకం కోసం ఐటీడీఏ అధికారులు బుధవారం డెమో నిర్వహించగా నిరుద్యోగ గిరిజన అభ్యర్థులు ఆందోళన నిర్వహించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, మరో ముగ్గురు బీఎడ్ కళాశాల అధ్యాపకులతో 2023లో నిర్వహించిన సీఆర్టీ జాబితాలోని మెరిట్ అభ్యర్థులతో డెమో నిర్వహించారు. దీంతో జిల్లలో ఎంతో మంది నిరుద్యోగులు ఉండగా కేవలం 2023 మెరిట్ లిస్టు ఆధారంగా డెమో నిర్వహించడం సరైనది కాదంటూ గిరిజన నిరుద్యోగులు పీఎంఆర్సీ ముందు బైఠాయించి ధర్నా చేశారు.దీంతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా వారితో మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మల్ జిల్లలో ఏడు, ఆదిలాబాద్ జిల్లాలో 10 ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల ఖాళీలు ఉన్నాయని వాటిని భర్తీ చేయడానికి మాత్రమే 2023 మెరిట్ లిస్టు ఆధారంగా కొంత మంది అభ్యర్థులను పిలిచి డెమో చూస్తున్నామన్నారు. జిల్లాలో 60 ఖాళీలు ఉన్నాయని సీఆర్టీల నియామకం కోసం అనుమతులు కావాలంటూ ప్రతిపాదనలు పంపించామని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి అనుమతి రాగానే నియామకాలు చేపడతామని పీఓ నిరుద్యోగ గిరిజనులను సముదాయించారు.ప్రస్తుతం మూతబడ్డ పాఠశాలలను తెరిపించే ప్రయత్నంలో భాగంగా అనుమతి ఉన్న సీఆర్టీల పోస్టులను భర్తీ చేయడానికి మాత్రమే కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ అంబాజి, ఇన్‌చార్జీ ఏపీఓ జనరల్ దామోదరస్వామి తదితరులున్నారు.



పీఎంఆర్సీ వద్ద ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

రేషన్‌కార్డులు అందరికీ ఇవ్వాలని వినతి

తాంసి, జూలై 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డును ప్రతి ఒక్కరికి అందించేలా చర్యలు తీసుకోవాలంటూ బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సామ సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వేలిముద్రలు పడని పెన్షన్‌దారులకు కూడా వెంటనే ఆసరాను అందించాలని కోరారు. చాలా మందికి జొన్నల డబ్బులు రాలేదని వెంటనే విడుదల చేయాలని కోరారు. ముఖ్యంగా రెవెన్యూ భూములను ప్రత్యేకంగా సర్వే చేసి ఎవరికి ఎన్ని ఎకరాలు రావాలో సూచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగడి నరసారెడ్డి, జింక చిన్న తాత, దేవరావు తదితరులు ఉన్నారు.

'శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించండి'

సిరికొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సిరికొండ ఎస్సై సట్లపల్లి పూజ అన్నారు. సిరికొండ మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సట్లపల్లి పూజకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్సై పూజ మాట్లాడుతూ మండలంలో ఏ సమస్యలు ఉన్న మహిళ ఎస్సైనని అనకుండా తమ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. పోలీసులకు అన్ని విధాలుగా బీఆర్ఎస్ పార్టీ సహకరిస్తుందని పార్టీ మండల నాయకులు మాజీ సర్పంచులు ఓరుగంటి పెంటన్న, రోహిదాస్, సూర్యకాంత్, సూర్యకాంత్, విజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చందు, సునీల్, మల్లేష్, గణేష్, నరసయ్య, అజ్గర్, లతీఫ్, లక్ష్మన్న, రాజు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

నేరడిగొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం హైదరాబాద్ లోబీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ కలిశారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గంతో పాటు ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో తీసుకెళ్లాలని స్థానిక ఎన్నికల్లో తెరాస జెండా ఎగరాలని కోరారు.

'పేదల సంక్షేమానికి ఇందిరమ్మ ఇళ్లు'

బోథ్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని ఆత్మ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు రాజు యాదవ్, బొడ్డు గంగారెడ్డికి చేరుకున్నారు. బుధవారం సోనాల మండల కేంద్రంలో పలువురి ఇండ్లకు భూమి పూజ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులు పూర్తి చేసుకున్న వారికి నిధులు మంజూరి ఈ విషయంలో ఎలాంటి అనుమానాలు వద్దన్నారు. ఇప్పటికే సోనాల మండల కేంద్రంలో పలువురి ఇండ్లకు డబ్బులు వారి వారి అకౌంట్‌లో ప్రభుత్వం నుండి జమ చేయడం జరిగిందన్నారు. సకాలంలో పిల్లలు పూర్తి చేసుకుంటే దశల వారీగా నిధులు జమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేష్, సీనియర్ నాయకులు గాజుల పోతన్న, కురిమే పోతున్నలతో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముండే శ్రీధర్, సహకార సంఘం డైరెక్టర్ లోలకు పోశెట్టి, ఎంపీడీవో రాజేశ్వర్, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, బిల్ కలెక్టర్ అజార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిసిన బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): నూతనంగా మంత్రి వర్గ విస్తరణలో మంత్రిగా ప్రమాణం చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను బుధవారం హైదరాబాద్‌లో ఆయన క్యాంపు కార్యాలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో గల పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకవేళ్లగా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, ప్రీతం రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శిరీష్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయి చైతన్య, యువ నాయకులు అభిలాష్, అజయ్, తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సారంగాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల అడెల్లి గ్రామ సమీపంలో బుధవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అడెల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సంఘటన స్థలానికి వెళ్లి పేకాట ఆడుతున్న 7గురిని పట్టుకొని రూ. 38వేల 340లను, 7సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఖద్దర్ నేతల..కబ్జాల భాగోతం

(5వ పేజీ తరువాయి...)

బయట పడుతుంది. సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విలువైన ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లి పోతున్న అధికారులు మాత్రం సైలెంట్‌గానే కనిపిస్తున్నారు.

నేతలకు వార్నింగ్

అధికారం, ఆర్థిక, రాజకీయ పలుకుబడితో అడ్డగోలు గా అక్రమాలకు పాల్పడిన కొంత మంది బడా నేతలు, ప్రముఖ వ్యాపారులు(సేట్లు) తప్పించుకుంటూ తిరుగుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలు సందర్భాల్లో నేతలపై రాజకీయ పరమైన విమర్శలు, ఆరోపణలు వస్తున్న పోలీసులు వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదన్న టాక్ వినిపిస్తుంది. అగ్ర నేతలు, ప్రముఖులు కావడంతో ఫిర్యాదులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తుంది. ముఖ్యంగా జిల్లాకేంద్రం పరిసర ప్రాంతాల్లోని మావల, భట్టిసావర్గాం, ఆదిలాబాద్ రూరల్ మండలం పరిధిలో భారీ భూ అక్రమాలు జరిగినట్లు గతంలో ఫిర్యాదులు వచ్చాయి. నకిలీ డాక్యుమెంట్లతో విలువైన ప్రభుత్వ అసైన్డ్ భూములు, చెరువులు, కుంటలు, కందకాలను ఆక్రమిం చి కబ్జా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే కొంత మంది బడా నేతలు ప్రముఖ వ్యాపారులపై ఫిర్యాదులు రావడంతో పోలీసులు పిలిపించి వార్నింగ్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతుంది. సరైన ఆధారాలు దొరికితే వీరిని కూడా జైలుకు పంపేందుకు పోలీసులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో డిజిటల్ మైక్రో ఫైనాన్స్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగిన బాధితులు

డిజిటల్ మైక్రో ఫైనాన్స్ పేరిట ఘరానా మోసం

(5వ పేజీ తరువాయి...)

ఫోన్లు సైతం స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయామని గ్రహించి కార్యాలయం ఎదుట బైఠాయించారు. కార్యాలయ ప్రారంభోత్సవానికి ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యారని, ప్రచారాన్ని చూసి నమ్మి మోసపోయామని బాధితులు వాపోయారు. అంతేకాకుండా కృష్ణ అనే వ్యక్తి వెద్మ ఫౌండేషన్ పేరిట సామాజిక కార్యక్రమలు కొనసాగిస్తున్నారని తెలిసిందన్నారు. అదే నమ్మకంతో తాము డ్రెస్‌కోడ్ కోసం రూ.20 వేలు చెల్లించామని, తమకు న్యాయం చేయాలని కోరారు.

డిజిటల్ మైక్రో ఫైనాన్స్‌లో ఉద్యోగాల ఎర

(5వ పేజీ తరువాయి...)

ఇప్పటి వరకు అద్దె కూడా చెల్లించ లేదని తెలిపారు. డిజిటల్ ఉద్యోగులందరికీ జూన్‌కు సంబంధించిన వేతనాలు మంగళవారం ఇస్తామని చెప్పి తనను హైదరాబాద్‌కు పిలిపించుకుని వాహనం ఇచ్చి ఉట్నూర్‌కు వెళ్తు నిర్మల్‌కు చేరుకునే లోపు మరో వాహనంలో వచ్చే వ్యక్తి మీకు డబ్బులు అందజేస్తారని, ఉట్నూర్‌కు వెళ్లి ఉద్యోగులందరికీ రూ.15వేల వంతున ఒక్కొక్కరికీ చెల్లించాలని తెలపడంతో తాము హైదరాబాద్ నుంచి మంగళవారం నిర్మల్‌కు చేరుకున్నామని చైర్మన్ చెప్పినట్టుగా నాలుగు గంటల పాటు ఎదురు చూసిన ఎవరు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి ఆదిలాబాద్ చేరుకున్నామని తెలిపారు. అక్కడ డీఎస్పీని కలవడానికి వెళ్లగా ఉట్నూర్ పోలీసులు నాతో పాటు డైరెక్టర్లను ఉట్నూర్ పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారని తెలిపారు. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి శత్రుఘన్ మాట్లాడుతూ తనకు ప్రతినెలా రూ.60వేల వేతనం ఇస్తానని తెలుపడంతో పాటు తన వద్ద కూడా రూ.10లక్షలు అప్పుగా తీసుకున్నారని తెలిపారు. ఉట్నూర్ కార్యాలయం ముందు మోసపోయామని గుర్తించిన నిరుద్యోగులు కొందరు ఉట్నూర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

తీన్మార్‌మల్లన్నపై దాడి చేయడం అమానుషం

● ముథోల్‌లో బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ నిరసన

ముథోల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తీన్మార్ మల్లన్నపై దాడి చేయడం అమానుషమని బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని న్యూ బస్టాండ్ సమీపాన రోడ్డుపై బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీసీ బిడ్డ తీన్మార్ మల్లన్నపై, అతని కార్యాలయంపై అన్యాయంగా దాడి చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బీసీలపై ప్రతిరోజు ఏదో ఒకచోట దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆరోపించారు. ప్రశ్నించే గొంతు తీన్మార్ మల్లన్నపై దాడిచేయడం అవివేకమని పేర్కొన్నారు. ఎవరైనా తప్పు చేస్తే న్యాయబద్ధంగా రాజ్యాంగబద్ధంగా, చట్టపరమైన చర్యలకు వెళ్లాలి. కానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, దౌర్జన్యం చేయడం సబబు కాదని తెలిపారు. ఎమ్మెల్సీ కవిత బీసీ బిడ్డలపై దౌర్జన్యంగా దాడులు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. నిత్యం ప్రజా సమస్యలపై స్పందించే సీనియర్ జర్నలిస్టు తీన్మార్ మల్లన్నను దాడులతో భయపెట్టి, గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛను హరించడం అప్రజాస్వామికమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముథోలక్ష తాలూకా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు రోళ్ల రమేష్, న్యాయవాది జట్టు గజేందర్, మాజీ సర్పంచ్ అనిల్, మండల బీజేపీ అధ్యక్షులు కోరి పోతన్న, నాయకులు ధర్మపురి, టి. రమేష్, సుభాష్, దశరథ్, విఠల్, లవన్ కుమార్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆహార ప్యాకెట్ల పంపిణీ

నిర్మల్ రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 150 మందికి పైగా రోగులకు వారి బంధువులకు ఉచితంగా ఆహార ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు విన్నర్స్ స్కూల్ టీచర్లు, న్యూ లక్ష్మీ ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విన్నర్స్ ఒలంపియాడ్ స్కూల్ చైర్మన్ ప్రసాద్ జన్మదిన సందర్భంగా మానవతా సేవలకు అంకితంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గెలుపుతో మొక్కు తీర్చుకున్న నాయకులు

ఆదిలాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వరుసగా మూడుసార్లు ఓటమి పాలై నాలుగోసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌పై జైనథ్ మండలంలోని అడా గ్రామస్తులు ప్రత్యేక అభిమా నాన్ని చాటుకున్నారు. తమ అభిమాన నాయకుడు ఎమ్మెల్యేగా గెలుపొందుతే తిరుపతి వెంకటేశ్వర స్వామిని 150 మంది దర్శించుకుని సామూహికంగా తల నీలాలను సమర్పిస్తామని అడా గ్రామస్తులు ఎన్నికల సమయంలో మొక్కు కున్నారు. దీంతో ఎమ్మెల్యేగా గెలుపొందిన పాయల్ శంకర్‌పై ఉన్న అభిమా నంతో బుధవారం తిరుపతికి వెళ్లి శ్రీ వెంకటేశ్వర స్వామికి తలనీలాలను సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



మొక్కు తీర్చుకున్న అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్‌తో గ్రామస్తులు

జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

» నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సా యంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ జూ నియర్ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధనతో పాటు మెరుగైన వసతు లు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జి ల్లాలో మొత్తం 13 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయని, 2,417 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్యను పెంచేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూ చించారు. మెరుగైన విద్యాబోధనతో పాటు అవసరం ఉన్న కళాశాలల్లో పైకప్పుల లీకేజీలు, మరమ్మతులు, అదనపు మరుగుదొడ్లు, ఫ్లోరింగ్, ఆర్ వో ప్లాంట్, తలుపులు, కిటికీలు తదితర అంశాలపై సంబంధిత అధికారు లు నివేదిక అందజేయాలని సూచించారు. అవసరమైన చోట ఉపాధి హా మీ పథకం నిధుల ద్వారా పనులు చేపట్టాలని, దశలవారీగా అభివృద్ధి ప నులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరుశు రాం, డీపీవో శ్రీనివాస్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల జారీపై జరుగుతున్న అవినీతిని అరికట్టాలి

» అడిషనల్ కలెక్టర్ బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకుడు మజర్ వినతి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నేరడిగొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నూతన రేషన్ కార్డుల జారీ లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడి యా నాయకులు మజర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ అడిషినల్ క లెక్టర్ శ్యామల దేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మజర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో ఫిబ్రవరిలో మీసేవ ద్వారా రేషన్ కార్డు లు దరఖాస్తు చేసుకున్న డీసీఎస్‌వోలో పెండింగ్ ఉంటుందని అ న్నారు. అమాయకమైన లబ్దిదారుల దగ్గర నుండి మధ్యవర్తుల ద్వారా రూ. 500 నుంచి రూ. 5000 వరకు వసూళ్లకు కొందరు పాల్పడుతున్నారని లబ్ధిదారులు తమకు తెలియజేస్తున్నారని అన్నారు. ఇలాంటి అవినీతికి పాల్పడుతున్న వారిని అరికట్టి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నెలల పాటు డీసీఎస్‌వోలో పెండింగ్‌లో ఉన్నాయని డీఎస్‌వో వాజిద్ అలీని ప్రశ్నించగా నువ్ ఎవరు అందరి గురించి అడగడానికి..?? ఎలక్షన్‌లలో గెలిచిన తర్వాత వచ్చి మాట్లాడు అని దురుసుగా సమాధానం ఇవ్వడంపై అడిషినల్ కలెక్టర్‌కిఫిర్యాదు చేసి డీఎస్‌వో మాట్లాడే పద్ధతిని మార్చుకోవలన్నారు. తాను అందజేసిన లిస్ట్ లబ్ధిదారుల రేషన్ కార్డులను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బజార్ హత్నూర్ మండల యువజన సంఘం అధ్యక్షుడు డుబ్బుల చంద్రశేఖర్, ప్రభాకర్, సాయి, రామ్ తదితరులు ఉన్నారు.

అవి ప్రమాద సూచికలా.. ప్రచార బోర్డులా!



ప్రమాద సూచికలపై ప్రచార బోర్డు అతికించిన దృశ్యం

తాంసి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలను సూచించేందు కోసం ఏర్పాటు చేసిన బోర్డులు ప్రచార బోర్డులా మారుతున్నాయి. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు రోడ్డు ప్రమాదాలను పాటించాలని, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా ఏర్పాటు చేస్తున్న బోర్డులు ప్రైవేట్ వ్యాపారులకు ప్రచార బోర్డులుగా మారుతున్నాయి. తాంసి మండలంలోని పొన్నారి, గోత్కూరి, వడ్డాడి ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డులకు కొంతమంది విత్తనాలు, పురుగుల మందుల స్టిక్కర్‌ను అతికేస్తుండగా కొందరు బోరు స్టిక్కర్లను అతికించిన సన్నివేశాలు కనిపిస్తున్నాయి. ఒక్కో బోర్డుకు వేలాది రూపాయలు ఖర్చు చేసి బోర్డు ఏర్పాటు చేస్తే ప్రైవేట్ వ్యాపారస్తులు తమ అవసరాల కోసం ఇలా వాడుకోవడం ఎంతవరకు సమంజసం అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ సంఘటనలను వివిధ శాఖల అధికారులు నిత్యం చూస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు కూడా లేకపోలేదు. వెంటనే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉందని ప్రజలు అంటున్నారు.

ప్రకృతి ప్రకోపానికి రైతన్న ఆగమాగం

» ముందు మురిపించి.. ఆ తర్వాత నిరాశ పరిచి
» నష్టాల ఊబిలో రైతన్నలు



వర్షాలు లేక ఎదుగుదల లేని సోయా పంట

కుంటాల, జూలై 16 : (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రైతులకు ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండే కష్టాలు మొదలయ్యాయి. గత రబీ సీజన్‌లో పండించిన వరి, మొక్కజొన్న, జొన్న, నువ్వు పంటలను విక్రయించుకుందామన్న రైతన్నకు ముందస్తుగా వర్షాలు కురియడంతో కల్లాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. కొంత మంది రైతుల వరి, జొన్నలు మొలకెత్తి చాలా వరకు నష్టం వాటిల్లింది. కిందా మీద పడి పండించిన పంటలను ఎంతో కొంతకు విక్రయించుకున్న రైతన్నకు ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండే కష్టాలు మొదలయ్యాయి. సీజన్ ప్రారంభంతో ఆశించిన మేర వర్షాలు కురవడంతో సంతోషంలో అన్నదాత పత్తి, సోయా, వరి విత్తనాలను విత్తుకున్నారు. అయితే ఆ తర్వాత 15 రోజుల పాటు వర్షాలు ముఖం చాటేయడంతో చాలా మంది రైతుల యొక్క విత్తిన విత్తనాలు సగానికి పైగా మొలకెత్తలేదు. మండలంలోని చాలా గ్రామాల్లో రైతులు సోయా, వరి విత్తనాలను రెండో సారి విత్తుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రైతన్నకు రెండో సారి విత్తనాలు, ఎరువులు కొనవలసిన పరిస్థితి నెలకొనడంతో చాలా మంది రైతులకు ఆర్థిక భారం ఎక్కువైంది. అలాగని రెండవ సారి సైతం విత్తనాలు విత్తుకుంటే ప్రస్తుతం గత వారం , పది రోజుల నుండి మళ్లీ వర్షాలు ముఖం చాటేయడంతో ప్రస్తుతం పత్తి, సోయా పంటలు ఎదుగుదల నిలిచిపోయాయి. గత వారానికి ముందు ఎడతెరపి లేకుండా ప్రతీ రోజు ముసురు కురియడంతో పత్తి, సోయా పంటలు కలుపు మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. ఒక్కో ఎకరం పత్తి కలుపు తీయాలంటే రైతన్నకు దాదాపు 5 వేల రూపాయల వరకు ఖర్చవుతుందని పేర్కొంటున్నాడు. ప్రస్తుతం కలుపుతీసిన పత్తి, సోయా పంటల్లో వరుణుడి జాడ లేకపోవడంతో పంటలు ఎదగడం లేదు.

జాడలేని పంట బీమా

గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతులకు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరిగినప్పుడు వాతావరణ ఆధారిత పంట బీమాను ప్రవేశపెట్టాయి. దీంతో నెల నెలా కురిసిన వర్షాల ఆధారంగా రైతులకు, పంటలకు నష్టం వాటిల్లితే. బీమా పథకం పనిచేసేది. ఈ పథకం ద్వారా రైతుకు ఎంతో కొంత బీమా సంస్థ నుండి సొమ్ము వచ్చేది. ప్రస్తుతం ఆ బీమా పథకం లేకపోవడంతో అన్నదాతకు నష్టపరిహారం అందడం లేదు.



పత్తి పంటలో పెరిగిన కలుపు మొక్కలు

పెట్టుబడులు రెట్టింపు

రైతన్న ఒకసారి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి విత్తుకుంటే ఆ పంట మొలకెత్తితే రైతన్న కళ్లలో ఆనందం ఉంటుంది. కాని సమయానికి వర్షాలు కురియకపోవడం కురిస్తే భారీగా కురియడం మూలంగా చాలా గ్రామాల్లో రైతులు వరినారు మళ్ల కోసం వరి విత్తనాలను రెండు సార్లు వేసుకోవాల్సి వచ్చింది. అంతేగాకుండా సోయా పంట సైతం రెండవ సారి విత్తుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో విత్తనాలకు, ఎరువులతో పాటు భూమిని చదును చేయటం కొరకు, సోయా వేసే యంత్రాంగం కొరకు రెండు మార్లు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొనడంతో రైతన్నకు పెట్టుబడి రెట్టింపవుతుంది.

పెరగని భూగర్భ జలాలు

వర్షాకాలం ప్రారంభమై 45 రోజులు గడిచినా అనుకున్న మేర వర్షాలు కురియకపోవడంతో ఏ ఒక్క చెరువులో చుక్క నీరు రాలేదు. అంతే గాకుండా భూగర్భ జలాలు పెరగలేదు. ప్రస్తుతం వరినాట్లు వేద్దామన్న రైతన్నకు భూగర్భ జలాల సమస్య నెలకొంది. ప్రస్తుతం భారీగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండితే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది.

వ్యవసాయ అధికారుల అంచనా

వ్యవసాయాధికారుల అంచనా మేరకు కుంటాల మండలంలో మొత్తం 25 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో 5 వేల ఎకరాల్లో



అంతంతమాత్రంగానే మొలకెత్తిన వరి నారు

రైతులు సోయా పంటను విత్తుకోగా 12 వేల ఎకరాల్లో పత్తి పంటను, 6 వేల ఎకరాల్లో వరి పైరు వేసేందుకు భూమిని సిద్ధంగా ఉంచుకోగా 1000 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. అయితే ఖరీఫ్ సీజన్ ప్రా రంభం నుంచే రైతన్నకు వర్షాలు అనుకున్నమేర కురియక కొంత రైతులు సోయా పంటను రెండు సార్లు సైతం విత్తుకున్నప్పటికి ప్రస్తుతం వర్షాలు జాడలేక మొలకెత్తిన పంటల ఎదుగుదల లేదని పేర్కొంటున్నారు.

రెండో సారి తొమ్మిది బ్యాగులు వేశా

(గుండ్ల గంగారెడ్డి, పెంచికల్‌పాడ్)



తాను ఈ ఏడాది వర్షాకాలంలో 5 ఎకరాల్లో సోయా పంట వేయడం జరిగింది. వేసినప్పటి నుంచి 15 రోజుల పాటు వర్షాలు కురియకపోవడంతో సోయా పంట మొలకెత్తక విత్తనాలన్నీ చెడిపోయాయి. దాంతో మరో మారు 9 బ్యాగులు సోయాలను కొనుగోలు చేసి విత్తనం వేయడం జరిగింది. అదనంగా 40 వేల వరకు భారమైంది.

రెండో సారి 12 బ్యాగులు వేశా

(హవర్గ ముత్యం, పెంచికల్‌పాడ్)



8 ఎకరాల్లో వర్షాకాలం సోయా పంట వేశాను. పంట మొలకెత్తక విత్తనాలు పాడవడంతో రెండవ సారి 12 బ్యాగుల విత్తనాలు మరోమారు కొనుగోలు చేసి వేశాను. విత్తనాలు, ఎరువులు కలిపి రెండు పర్యాయాలకు దాదాపు లక్ష రూపాయల వరకు ఖర్చు అయింది.

జొన్నల డబ్బులు అందక రైతుల ఇబ్బందులు

సారంగాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని జాం, కౌట్ల, స్వర్ణ, అడెల్లి గ్రామాలతో పాటు తదితర గ్రామాల రైతులు గత 40 రోజుల క్రితం ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో జొన్నలను విక్రయించిన డబ్బులు ఇంకా రైతులు బ్యాంకు ఖాతాల్లో జమ కాక పోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని రైతులు పేర్కొంటున్నారు. జొన్నలు విక్రయించే సమయంలో సంబంధిత అధికాయులు పదిహేను రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారని ఇప్పటికి జొన్నల డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమకాలేదని రైతులు తెలిపారు. విక్రయించిన జొన్నల డబ్బులు జమ కాకపోవడంతో పంటలు వేసే సమయంలో విత్తనాలకు, ఎరువులకు, వ్యాపారుల వద్ద వడ్డీలకు అప్పు తెచ్చి పంటలను సాగు చేయడం జరిగిందని పేర్కొన్నారు. డబ్బుల కోసం సంబంధిత అధికారుల వద్దకు పలుమార్లు వెళ్లినప్పటికి రెండు రోజుల్లో జమ చేయడం జరుగుతుందని చెప్తున్నారే తప్ప ఇ ప్పటి వరకు డబ్బులను జమ చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికయిన రైతుల ను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు జొ న్నల డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నారు.

బోనమెత్తిన విద్యార్థులు



వివిధ వేషధారణలు ధరించి బోనమెత్తిన విద్యార్థులు

ముథోల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ముథోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర పండుగ 'బోనాల పండుగ' తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేషధారణలతో ఘటాలు (బోనాలు) ఎత్తుకున్నారు. అనంతరం ఘటాలను ఉంచి పూజలు నిర్వహించి, వండుకొచ్చిన బోనాలను నైవేద్యంగా సమర్పించారు. పంటలు బాగా పండాలని, అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించలని ఆ మహాకాళిమాతను, ఎల్లమ్మను వేడుకున్నారు. ప్రసాదాన్ని పిల్లలకు పంచిపెట్టారు. అనంతరం బోనాల పండుగ విశిష్టతను తెలియపరిచి సాంస్కృతిక నృత్యాలు నిర్వహించారు. పిల్లల వేషధారణలు, సాంస్కృతిక నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



భైంసా రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాటేగాం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై టూ వీలర్ వాహనాలను మహిళా పోలీస్ ప్రియాంక తనిఖీ చేశారు. శాంతి భద్రత పరిరక్షణలో మహిళా పోలీసుల భాగస్వామ్యం అవసరమని ఎస్పీ జానకి షర్మిల తెలిపారన్నారు. ఇటువంటి అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ మహిళా పోలీస్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా మహి ళా పోలీసులు మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు న డపకూడదని, సరైన ధ్రువపత్రాలతో, హెల్మెట్ ధరించి డ్రై వింగ్ చేయాలని వాహనదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ బృందం పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ తనిఖీలు

ఖానాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌సీ కల్పన గ్రామాన్ని సందర్శించి గ్రామంలో పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలను, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు.

డ్రైనేజీలు అస్తవ్యస్తం.. పారిశుధ్యం అధ్వానం

ఆదిలాబాద్ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా బస్టాండ్ సమీపంలో, రామ్‌లీలా మైదాన్, ప్రభుత్వ డైట్ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వద్ద చేపట్టిన డ్రైనేజీలను పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేయడంతో ఈ సమస్య నెలకొంది. మురుగు నీరు సాఫీగా ప్రవహించే మా ర్గం లేకపోవడంతో దుర్గంధ భరితమైన వాతావరణం ఏర్పడుతుంది. అసలే రోగాల కాలం కా వడంతో ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది.

● ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

మల్టీపర్పస్ వద్ద..





పోలీస్ గెస్ట్ హౌస్ ముందు



రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ దగ్గర



రామ్‌లీలా మైదాన్

జిల్లా గణాంక శాఖ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

నిర్మల్ రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గణాంక శాఖ ఉద్యోగుల టెస్సా (తెలంగాణ ఎకనామిక్ అండ్ స్టాటిస్టికల్ సబార్డినేట్స్ అసోసియేషన్) సంఘ డైరీని బుధవారం సాయంత్రం జిల్లా గణాంక శాఖ కార్యాలయంలో అధ్యక్ష, కార్యదర్శుల సమక్షంలో జిల్లా గణాంక శాఖ అధికారి జీవరత్నం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గణాంక శాఖ అధికారులు డి. రవీందర్, జి. శ్రీనివాస్, హరీష్, ప్రశాంత్, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జాదవ్ సాయికృష్ణ, రాథోడ్ నరేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్ ఆస్పత్రిలో సేవలపై వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం

- కలెక్టర్ అభిలాష అభినవ్
- నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రి సందర్శన
- వైద్య విభాగాల పరిశీలన
- ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందానికి అభినందన

నిర్మల్ టౌన్/ సారంగాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్‌కు దీటుగా మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, పలు విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటైన చిన్న పిల్లల వైద్య విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్ చిన్నారులకు అన్ని రకాల వైద్య సేవలు మెరుగ్గా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగులతో మాట్లాడారు. ఈ సందర్శనలో ఆస్పత్రి పర్యవేక్షకుడు గోపాల్ సింగ్, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల్లో ఆందోళన వద్దు...

విపత్తుల పరిస్థితుల్లో ప్రజలు ఆందోళన చెందవద్దని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) సమీపంలో మైనారిటీ స్కూల్‌లో నిర్వహించిన విపత్తు నిర్వహణ, ఎన్‌డీఆర్‌ఎఫ్ కేంద్ర బృందం సహాయక విన్యాసాలను పరిశీలించారు. ఆ బృంద సభ్యుల పనితీరును పరిశీలించి అభినందించారు.



చించోలి(బి)లో ఎన్‌డీఆర్‌ఎఫ్ సహాయక విన్యాసాలు పరిశీలిస్తున్న కలెక్టర్

పాఠశాల చాలా బాగుంది

- అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మొక్కలు నాటుతున్న అడిషనల్ కలెక్టర్

మామడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల చాలా బాగుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. పాఠశాల వాతావరణం, ఎన్‌సీసీ విన్యాసాలు, క్రమశిక్షణతో కూడిన విద్యార్థులు తనకెంతో నచ్చాయని, ఇటువంటి పాఠశాలను ఎక్కడా చూడలేదని ఆయన అన్నారు. నిర్మల్ జిల్లా మామడ మండలంలోని పొన్కల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలశక్తి అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో జిల్లా కలెక్టర్ ఈ బాలశక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి విద్యార్థి కంప్యూటర్ పరిజ్ఞానం నేర్చుకోవాలని సూచించారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. ఈ పాఠశాలలో ఎన్‌సీసీ ఉండడం ఎంతో అదృష్టం. వీటిలో అందరూ రాణించాలని తెలిపారు. విద్యతో పాటు ఆరోగ్యంపై, క్రీడలపై ఉన్నత లక్ష్యాల వైపు ముందుకు వెళ్లాలని విద్యార్థులకు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యతో పాటు భవిష్యత్తు ఎలా ఉంటే బాగుంటుందో తెలపాలన్నారు. అనంతరం సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రామారావు, జిల్లా వైద్యాధికారి రాజేందర్, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఎంఈవో వై. వెంకట రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు షైన అరవింద్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, వీడీసీ సభ్యులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. .

బీటెక్‌లో సీటు రాదేమోనని..

- విద్యార్థి బలవన్మరణం



శ్రీకర్ (ఫైల్)

నిర్మల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్‌లో ర్యాంక్ తక్కువగా వచ్చిందని తీవ్ర మనస్తాపం చెందిన యువకుడు తన అపార్ట్‌మెంట్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లో నివాసముండే శ్రీకర్(19) అనే విద్యార్థి ఇటీవల జరిగిన ఎప్‌సెట్‌లో (ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష)లో 17 వేల ర్యాంక్ సాధించాడు. అయితే తనకు గవర్నమెంట్ ఇంజనీరింగ్ కాలేజీలో సీటు రాదేమోనన్న బాధతో మనస్తాపానికి గురై ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లిదండ్రులు ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉంటున్నారు. మృతుడు శ్రీకర్ తన బంధువులతో కలిసి ఉంటున్నాడు. ఈ మేరకు టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారిపై చర్యలు

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్

నిర్మల్ రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు ఉల్లంఘించి, లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ తెలిపారు. బుధవారం బాలికల ప్రాధాన్యత జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో పీసీపీ యాక్ట్ 1994పై జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ... పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్ నియమ నిబంధనలు ఉల్లంఘించి, లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికల ప్రాధాన్యత గురించి పీసీ, పీఎన్‌డీటీ యాక్ట్ గురించి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ సౌమ్య, డాక్టర్ విన్నీ, డాక్టర్ వాసు, సఖి చీఫ్ అడ్మినిస్ట్రేటర్ శ్వేత, డీపీఆర్‌వో విష్ణు, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్, తదితరులు పాల్గొన్నారు

'వర్షాభావ ప్రతికూలతలు లేకుండా చూసుకోవాలి'

పెంబి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పంటల్లో వర్షాభావ ప్రతికూలతలు లేకుండా చూసుకోవాలని వారం రోజుల నుంచి వర్షం పడడం లేదని, పత్తి, మొక్కజొన్న, పసుపు పంటలు సాగు చేస్తున్న రైతులు నష్టపోకుండా తక్షణ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాలని పెంబి వ్యవసాయ అధికారి నవీన్ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని అంకెనా, వెంకంపోచంపాడ్, కర్ణం లొద్ది గ్రామాల్లో రైతులతో సమావేశమై వర్షాభావ పరిస్థితుల్లో పంటలలో చేపట్టాల్సిన తక్షణ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వర్షాభావ పరిస్థితుల్లో నేలలో తేమ లేకపోవడం వల్ల మొక్కలు పోషకాలను గ్రహించలేవని, తద్వారా మొక్కలు వడలిపోతున్న లక్షణాలను చూపిస్తాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో పంటలకు సాంప్రదాయ ఎరువైలన యూరియా, డీఏపీలు సైతం వేయడానికి రైతులకు అవకాశం కూడా ఉండదు. కావునా ఈ వడలు లక్షణాలు గమనించిన వెంటనే మొక్కల ఎదుగుదలను బట్టి లీటరు నీటికి 3-5 ఎంఎల్‌ల నానో యూరియా, నానో డీఏపీ, లేదా నీటిలో కరిగే ఎరువులైన 19-19-19, 17-44-0, ఎరువులలో ఏదో ఒక దానిని పై పాటుగా పిచికారీ చేయడం ద్వారా మొక్కలకు తక్షణ ఉపశమనం లభిస్తుందని తెలిపారు. తద్వారా మొక్కలు నీటి ఎద్దడిని తట్టుకునే సామర్థ్యాన్ని అందిపుచ్చుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రాజ్ కుమార్, రైతులు ఉన్నారు.

ధాన్యానికి టెండర్



- వేలం పాట ధాన్యాన్ని అప్పజెప్పని మిల్లర్లు
- గత నెలలోనే గడువు ముగిసిన పూర్తికాని టార్గెట్
- పదిహేను శాతానికి మించని చెల్లింపు
- అయిన మిల్లర్లపై చర్యలు కరువు

నిర్మల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో పేరుకుపోయిన ధాన్యం నిల్వలను విక్రయించేందుకు అధికారులు ప్రయత్నించినా మిల్లర్లు సహకారం అందించడం లేదు. జిల్లాలో 2022-2023 రబీ సీజన్‌కు సంబంధించిన 1లక్ష49 వేల294 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ధాన్యం విక్రయించేందుకు టెండర్‌ను నిర్వహించారు. మొత్తం 1లక్ష49వేల294 మెట్రిక్ టన్నుల ధాన్యం విలువ రూ. 301 కోట్లుగా నిర్ధారించారు. సదరు టెండర్ పొందిన కాంట్రాక్టర్ ప్రభుత్వానికి రూ.301 కోట్లను చెల్లించి 1లక్ష49వేల294 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తీసుకోవాలి. 2022-2023 రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యాన్ని పెద్దమొత్తంలోనే రైస్‌మిల్లర్లు పక్కదోవ పట్టించారన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రభుత్వం తనిఖీలు కూడా నిర్వహించి షోకాజ్ నోటీసులను జారీ చేసింది.

రైస్‌మిల్లర్ల వద్ద పేరుకుపోయిన భారీ మొత్తం ధాన్యాన్ని రైస్‌మిల్లర్ల నుంచి రికవరీ చేసేందుకు ఈ టెండర్ ప్రక్రియను చేపట్టింది. దీంతో ఇటు మిల్లర్ల నుంచి బకాయి ఉన్న ధాన్యాన్ని రికవరీ చేయడమే కాకుండా ఆ ధాన్యానికి సంబంధించిన డబ్బులను కూడా సదరు కాంట్రాక్టర్ నుంచి పొందే అవకాశం ఉంటుంది. దీని కారణంగానే పౌర సరఫరాల శాఖ అప్పటి ధాన్యానికి టెండర్‌ను పిలిచింది. అయితే ఇప్పటి వరకు రైస్‌మిల్లర్లు కేవలం 17,415 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు అప్పగించారు. మిగతా 1లక్ష31వేల879 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు ఈ టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు అప్పగించాల్సి ఉంది. ఈ మొత్తం ధాన్యాన్ని అప్పగిస్తే సంబంధిత కాంట్రాక్టర్ ప్రభుత్వానికి 265.91 కోట్లు సర్కారుకు చెల్లించాల్సి ఉంది. కాగా టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం ధాన్యాన్ని లిఫ్ట్ చేసేందు కోసం గత జూన్ 10వ తేదీ వరకు గడువు విధించింది. ఇప్పటికే గడువు ముగిసి దాదాపు 25 రోజులు గడుస్తున్నప్పటికి ఇప్పటి వరకు ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. కాగా సంబంధిత శాఖ అధికారులు మాత్రం ఈ వ్యవహారాల్లో తమకు సంబంధం లేదని ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నామంటూ స్పష్టం చేస్తున్నారు.

అంతా కుమ్మక్కు..

2022-2023 రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం టెండర్ వ్యవహారంతో పాటు పలువురు రైస్‌మిల్లర్ల వ్యవహారం సైతం గందరగోళానికి దారి తీస్తోందని అంటున్నారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రైస్‌మిల్లర్ల నుంచి ధాన్యంకు బదులుగా డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. క్వింటాల్ ధాన్యానికి సదరు కాంట్రాక్టర్ టెండర్ అగ్రిమెంట్ ప్రకారం రూ. 2016 రూపాయలు చెల్లించాల్సి ఉంది. అయితే సంబంధిత కాంట్రాక్టర్ మిల్లర్ల వద్దనే 2,228 రూపాయలకు క్వింటాల్ ధాన్యాన్ని తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ డబ్బుల నుంచి ఆయన సర్కారుకు క్వింటాల్‌కు గానూ రూ. 2016ను చెల్లించి మిగతా డబ్బులను తన ఆదాయ ఖాతాలో వేసుకుంటున్నట్లు పేర్కొంటున్నారు. రైస్‌మిల్లర్లు తమ వద్ద ధాన్యం నిల్వలు లేని కారణంగా డబ్బులనే చెల్లిస్తామని కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెబుతున్నారు. క్వింటాల్‌కు రూ. 212 చొప్పున పైపైనే ఆధాయాన్ని కొట్టేశారంటున్నారు.

మిల్లర్ల వద్ద నిల్వలపై అనుమానాలు...

2022-2023 రబీ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ ధాన్యం నిల్వలు రైస్‌మిల్లర్ల వద్ద ఉన్నాయో లేవోనన్న సందేహాలు తలెత్తుతున్నాయి. చాలా రైస్‌మిల్లుల్లో భారీ ఎత్తున సీఎంఆర్ ధాన్యం మాయమైనట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఈ అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు ఉన్నతాధికారులు పలుసార్లు కొన్ని రైస్‌మిల్లులపై తనిఖీలు చేసి ధాన్యం నిల్వల్లో భారీ వ్యత్యాసాలున్నట్లు గుర్తించారు. ప్రతి సీజన్‌కు సంబంధించి గడువులోగా సీఎంఆర్ బియ్యాన్ని అప్పజెప్పాలని కోరుతున్నప్పటికి మిల్లర్లు మాత్రం తమ మొండి వైఖరిని వీడడం లేదు. అధికారులు కొన్ని మిల్లులపై కేసులు నమోదు చేయగా మరికొన్ని మిల్లులను సీజ్ కూడా చేశారు. తనిఖీల సందర్భంగా సీఎంఆర్ ధాన్యం స్టాక్ నిల్వల్లో వ్యత్యాసాలున్నా ఆ ధాన్యం రికవరీ విషయంలో సీరియస్ చర్యలు చేపట్టలేదు. దీనిని అలుసుగా తీసుకున్న కొంతమంది రైస్ మిల్లర్లు సీజన్‌ల వారిగా సీఎంఆర్ ధాన్యాన్ని మాయం చేసి ఒక సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్నే మరో సీజన్‌కు చెందినవిగా లెక్కలు చూపిస్తూ అధికారులను గందరగోళానికి గురి చేశారంటున్నారు.

అధికారులు పరిశీలిస్తున్నారు..

సుధాకర్, మేనేజర్, జిల్లా పౌర సరఫరాల సంస్థ

2022-23 రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం టెండర్ విషయం పై అధికారుల పరిశీలనలో ఉంది. లక్ష 49 వేల 294 మెట్రిక్ టన్నుల ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం టెండర్ పిలిచాం. ఈ ధాన్యం విలువ రూ. 301 కోట్లు కాగా, టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు జిల్లాకు చెందిన రైస్ మిల్లర్లు ఇప్పటి వరకు 17 వేల 415 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అప్పగించాం. అప్పజెప్పిన ధాన్యం విలువ రూ. 35 కోట్లు కాగా ఇంకా రూ. 265.91 కోట్ల విలువ గల ధాన్యాన్ని అప్పజెప్పాలి. ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగకపోవడానికి గల కారణాలు నాకు తెలియదు. 2025 జూన్ 10వ తేదీ వరకు గడువు ఉండగా... ఆ గడువు కూడా ముగిసింది.

హాస్టల్‌లో విద్యార్థులతో బోర్ మరమ్మతులు

- వీడియో వైరల్
- మస్కాపూర్ బీసీ వసతి గృహంలో ఘటన

ఖానాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : చదువుకుంటారని గంపెడాశలతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఓ ప్రభుత్వ వసతి గృహంలో సంబంధిత హాస్టల్ వార్డెన్ ఆ పిల్లలతో వెట్టి చాకిరి చేయిస్తున్న ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే బుధవారం మస్కాపూర్ గ్రామంలోని బీసీ వసతి గృహంలో బోర్ రిపేర్ రావడంతో సంబంధిత హాస్టల్ వార్డెన్ విద్యార్థులతో బోర్ రిపేర్ పనులు చేయించారు. దీని తాలూకు వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జరిగిన ఘటనపై వార్డెన్ ప్రకాష్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తాను లీవ్‌లో ఉన్నానని ఏదైనా ఉంటే రేపు హాస్టల్‌కి వచ్చి కలిస్తే మాట్లాడుతానన్నారు. విద్యార్థులతో బోర్ మోటార్ రిపేర్ పనులు ఎందుకు చేయిస్తున్నారని ప్రశ్నించగా అసభ్యకర పదజాలంతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న వేళ విద్యుత్ తీగల వైపు వెళ్లొద్దని ఓవైపు ప్రభుత్వ విద్యార్థులను అప్రమత్తం చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు ఆయా పాఠశాలల్లో వసతి గృహాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తోంది. ఈ తరుణంలో మస్కాపూర్‌లోని బీసీ వసతి గృహంలో మాత్రం నేరుగా విద్యార్థులతోనే బోర్ మోటార్ రిపేర్ పనులు చేయించడంతో పాటు పైపు విద్యుత్ వైర్‌ను బయటకు తీయించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానికులు, అధికారుల తీరుపై మండిపడుతున్నారు. షార్ట్ సర్క్యూట్ అయి విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే దానికి ఎవరు బాధ్యులు ఉంటారని ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



బోర్ రిపేర్ పనుల్లో విద్యార్థులు

హత్యాయత్నం కేసులో నలుగురి రిమాండ్

- ముథోల్ సీఐ మల్లేష్

ముథోల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా ముథోల్ మండలం ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులను హత్యాయత్నం కేసులో అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ముథోల్ సీఐ మల్లేష్ తెలిపారు. బుధవారం సంబంధిత వివరాలను సీఐ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన సాయన్న వరుసకు మామయ్య అయిన కాశీరాంకు సంబంధించిన వ్యవసాయ చేను మూడెకరాల తొమ్మిది గుంటల చేనును సాయన్న సాగు చేస్తున్నాడు. అయితే కాశీరాం అనే వ్యక్తి సుమారు ఆరు నెలల క్రితం చనిపోయాడు. ఈ సంవత్సరం కాశీరాంకు వరుసకు కొడుకు అయిన నారాయణ చేనులో కంది విత్తాడు. ఈ విషయం తెలుసుకున్న సాయన్న నేను సాగు చేస్తున్న చేనులో నాకు గుర్తు లేకుండా మిగతా వారు ఎవరు దున్నుతారని మంగళవారం సాయన్న తన కుటుంబ సభ్యులైన భార్య ముత్తవ్వ, కుమార్తెలు సంధ్యారాణి, స్వప్నలతో కలిసి చేను దున్నుతుండగా ఈ విషయం గమనించిన నారాయణ, నర్సయ్య, రుక్మాబాయి, అనితలు కలిసి సాయన్నతో పాటు అతని కుటుంబ సభ్యులపై కర్రలతో, గొడ్డలితో దాడి చేశారు. దీంతో దెబ్బలు భరించలేక అరవడంతో దాడి చేసిన నలుగురు నారాయణ, నర్సయ్య, రుక్మాబాయి, అనితలు అక్కడి నుండి పరారయ్యారు. దీంతో బాధితులు 100కు డయల్ చేయడంతో ముథోల్ ఎస్సై బిట్ల పెర్సెస్ సంఘటన స్థలానికి చేరుకొని తీవ్ర గాయాలైన సాయన్న, సంధ్యారాణి, స్వప్నలకు చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. సాయన్న భార్య ముత్తవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముథోల్ పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్సై బిట్ల పెర్సెస్, పోలీస్ సిబ్బంది, తదితరులున్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

తానూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్గం, దౌల్తాబాద్, ఝరి గ్రామాల్లో ఇటీవల పలువురు అనారోగ్యం కారణంగా మరణించడంతో బుధవారం ముథోల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జీ భోస్లే నారాయణ్‌రావుపటేల్ పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలను తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈయన వెంట కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు శంకర్ చంద్రే, మాజీ ఎంపీటీసీ సాధాశివ్‌పటేల్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుండలిక్, గోవింద్‌రావుపటేల్, మాజీ ఎంపీపీ మధురావుపటేల్, మాజీ సర్పంచ్ సంజయ్, మధురావుపటేల్, మాజీ ఎంపీటీసీ ఆత్మ డైరెక్టర్ హన్మంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అలుగు మరమ్మతులు చేయాలని డిమాండ్

నర్సాపూర్(జి), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని నడిమి చెరువు అలుగు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు అలుగును తక్షణమే మరమ్మతు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మరమ్మతులు చేపడితే చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, చేపలు పెంపకానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని, తద్వారా బోయ కులస్తులకు మెరుగైన జీవనోపాధి లభిస్తుందని గ్రామస్థులు అంటున్నారు. ప్రస్తుతం అలుగు శిథిలావస్థలో ఉండటంతో చేపల పెంపకం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా చెరువులో నీటి మట్టం పెరగడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని, ఇది వ్యవసాయం చేసే రైతులకు సాగునీటి కొరతను తీర్చి, పంట దిగుబడులను పెంచుతుందని వారు పేర్కొంటున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి, నడిమి చెరువు అలుగు మరమ్మతులకు తక్షణ నిధులు కేటాయించి పనులను చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన



పార్‌పెల్లిలో సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్థులు

లక్ష్మణచాంద, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని గ్రామస్థులు సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు. ఇష్టారీతిన వ్యవహరిస్తుండటం కారణంగా విద్యుత్ సరఫరాలో తరచుగా అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పుణ్యక్షేత్రాలు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులు

నిర్మల్ రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని డిపోమేనేజర్ కే.పండరి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బుధవారం నిర్మల్ బస్టాండ్ నుంచి అరుణాచలం, పలని, రామేశ్వరం, శ్రీరంగం సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక క్షేత్రాలకు, విహార యాత్రలకు మీరు కోరుకున్న చోటికి బస్సులు నడుపుతామని ఆయన తెలిపారు. అరుణాచలానికి ఇంతకు ముందు చాలా సార్లు వెళ్లి వచ్చిందని, ఇప్పుడు ప్రయాణికుల కోరిక మేరకు మళ్లీ ట్రిప్ వేశామని, త్వరలో ప్రయాగ్ రాజ్, కాశీ, అయోధ్య, యాదగిరిగుట్ట, స్వర్ణగిరి, పండరిపూర్ బస్సులు నడుపుతామని, 30 మంది ప్రయణికులు ఉంటే మీ గ్రామానికే బస్సు పంపుతామని డిపో మేనేజర్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9959226003, 8328021517, 7382842582లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

సోన్ పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసి అడిషనల్ ఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ

సోన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సోన్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా తనిఖీ చేశారు. అడిషనల్ ఎస్పీకి సీఐ గోవర్ధన్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పోలీస్ స్టేషన్ భవనాన్ని పరిశీలించి, స్టేషన్ ఆవరణలో పట్టుకుని ఉంచిన వాహనాలు, వాటి వివరాలు, ప్రమాదానికి గురైన వాహనాల వివరాలు, స్టేషన్ రికార్డులను పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా సీసీ టీవీల పనితీరు, పోలీస్ వాహనాల పనితీరు, స్టేషన్ పరిసరాలను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గోపి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.